www.aksharadarbar.com
మంగళవారం 27, ఆగస్టు 2024
అక్షర దర్బార్
voice of the people
తెలుగు దినపత్రిక వరంగల్ | సంచిక : 174 | సంపుటి :02 | పేజీలు : 04 | వెల : 05

5 లో

గ్రామాల సమగ్ర అభివృద్ధే లక్ష్యం

- భూపాలపల్లి ఎమ్మెల్యే జీఎస్సార్
- బుద్ధారం గ్రామంలో ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు

కేటీఆర్ కు హైడ్రా షాక్ !

- జన్వాడ ఫాంహౌస్ కూల్చివేతకు రంగం సిద్ధం !
- కొలతలు వేసిన ఇరిగేషన్ అధికారులు

5 లో

కిరాణం చాటున బెల్ట్ దందా..

- పుట్టగొడుగుల్లా గల్లీ గల్లీకో షాపు..
- మద్యం మత్తులో ఊగుతున్న పల్లెలు

3 లో

కవితకు బెయిల్

- ఏ క్షణంలోనైనా రిలీజ్.. రేపు మధ్యాహ్నం తర్వాత హైదరాబాద్‌కు..
- సంబురాల్లో గులాబీ శ్రేణులు

డిల్లీ లిక్కర్ స్కామ్ కేసులో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితకు బిగ్ రిలీఫ్ దక్కింది. ఈడీ, సీబీఐ కేసుల్లో సుప్రీంకోర్టు బెయిల్ మంజూరు చేసింది. మంగళవారం రాత్రి లేదా బుధవారం ఉదయం కల్లా ఆమె జైలు నుంచి విడుదలకానున్నారు. కవితను అరెస్టు చేసి నేటికి 166 రోజులు కాగా.. జ్యుడిషీయల్ కస్టడీలో భాగంగా 153 రోజులుగా తీహార్ జైలులోనే ఉన్నారు. పలుమార్లు ఆమె బెయిల్ కోసం సీబీఐ, ఈడీ కోర్టులను ఆశ్రయించగా చేదు అనుభవమే ఎదురైంది. దీంతో కవిత సుప్రీం కోర్టులో బెయిల్ పిటిషన్ దాఖలు చేశారు. నేడు ఈ పిటిషన్ విచారణకు రాగా.. జస్టిస్ గవాయ్, విశ్వనాథ్‌తో కూడిన ద్విసభ్య ధర్మాసనం విచారణ చేపట్టింది. కవిత తరుపున సీనియర్ న్యాయవాది ముకుల్ రోహద్గీ ఈడీ తరుపున వాదనలు వినిపించారు. ఇరువైపులా వాదనలు విన్న ధర్మాసనం కవితకు బెయిల్ మంజూరు చేసింది.

— అక్షరదర్బార్, ఢిల్లీ :

- ఈడీ, సీబీఐ రెండు కేసుల్లోనూ మంజూరుచేసిన సుప్రీంకోర్టు
- రూ. 10 లక్షల పూచీకత్తు, పాస్‌పోర్ట్ అప్పగించాలని షరతు
- మార్చి 15న బీఆర్ఎస్ ఎమ్మెల్సీ అరెస్ట్
- 166 రోజులుగా తిహార్ జైలులోనే..
- ఢిల్లీలో మకాంవేసిన కేటీఆర్, హరీష్‌రావు బీఆర్ఎస్ ముఖ్యనేతలు

2 లో

4 లో

ఆదివాసీలు, గిరిజనులు అన్ని రంగాల్లో రాణించాలి

- ఆర్థిక అభివృద్ధి సాధించాలి
- విద్యా అవకాశాలను అందిపుచ్చుకోవాలి
- పథకాలను సద్వినియోగం చేసుకోవాలి
- ఆ దిశగా అధికారులు చిత్తశుద్ధితో కృషి చేయాలి
- రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ
- ములుగు జిల్లాలో పర్యటన
- ఉన్నతాధికారులతో సమావేశం
- రామప్ప, కోటగుల్లు సందర్శన

అడవిని నమ్ముకుని జీవించే నిర్మలమైన మనసు గల ఆదివాసీలు, గిరిజనుల అభ్యున్నతికి అధికారులు చిత్తశుద్ధితో కృషి చేయాలని రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ సూచించారు. ఆదివాసీలు, గిరిజనులు అవకాశాలను అందిపుచ్చుకుంటూ అన్ని రంగాల్లో ఎదగాలని ఆకాంక్షించారు. మూడు రోజుల పర్యటనలో భాగంగా మంగళవారం గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ ములుగు జిల్లాకు చేరుకున్నారు. తొలుత యాదాద్రి జిల్లా పర్యటన అనంతరం రోడ్డు మార్గంలో ములుగుకు వచ్చారు.

— అక్షరదర్బార్, ములుగు

ఉత్కంఠ..!

- పీసీసీ అధ్యక్షుడిగా మహేశ్ కే అవకాశం
- బీసీ సామాజిక వర్గంవైపే హైకమాండ్ మొగ్గు..
- రేపు ఏఐసీసీ నుంచి అధికారిక ప్రకటన !

2 లో

సెప్టెంబర్ 17 నుంచి ప్రజాపాలన

- పది రోజులపాటు కార్యక్రమం
- రేషన్ కార్డులు, హెల్త్ కార్డులే ఎజెండా
- అధికారుల సమీక్షలో సీఎం రేవంత్ రెడ్డి

వివరాలు 5వ పేజీలో..

అక్షర దర్బార్
voice of the people
తెలుగు దినపత్రిక

కవితకు బెయిల్

- ఈడీ, సీబీఐ రెండు కేసుల్లోనూ మంజూరుచేసిన సుప్రీంకోర్టు
- రూ. 10 లక్షల పూచీకత్తు, పాస్‌పోర్ట్ అప్పగించాలని షరతు
- మార్చి 15న బీఆర్ఎస్ ఎమ్మెల్సీ అరెస్ట్
- 166 రోజులుగా తిహార్ జైలులోనే..
- ఢిల్లీలో మకాంవేసిన కేటీఆర్, హరీష్‌రావు బీఆర్ఎస్ ముఖ్యనేతలు
- ఏ క్షణంలోనైనా రిలీజ్.. రేపు మధ్యాహ్నం తర్వాత హైదరాబాద్‌కు..
- సంబురాల్లో గులాబీ శ్రేణులు

అక్షరదర్బార్, ఢిల్లీ : ఢిల్లీ లిక్కర్ స్కామ్ కేసులో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితకు బిగ్ రిలీఫ్ దక్కింది. ఈడీ, సీబీఐ కేసుల్లో సుప్రీంకోర్టు బెయిల్ మంజూరు చేసింది. మంగళవారం రాత్రి లేదా బుధవారం ఉదయం కల్లా ఆమె జైలు నుంచి విడుదలకానున్నారు. కవితను అరెస్టు చేసి నేటికి 166 రోజులు కాగా.. జ్యుడీషియల్ కస్టడీలో భాగంగా 153 రోజులుగా తీహార్ జైలులోనే ఉన్నారు. పలుమార్లు ఆమె బెయిల్ కోసం సీబీఐ, ఈడీ కోర్టులను ఆశ్రయించగా చేదు అనుభవమే ఎదురైంది. దీంతో కవిత సుప్రీం కోర్టులో బెయిల్ పిటిషన్ దాఖలు చేశారు. నేడు ఈ పిటిషన్ విచారణకు రాగా.. జస్టిస్ గవాయ్, విశ్వనాథ్‌తో కూడిన ద్విసభ్య ధర్మాసనం విచారణ చేపట్టింది. కవిత తరుపున సీనియర్ న్యాయవాది ముకుల్ రోహిద్గీ ఈడీ తరుపున వాదనలు వినిపించారు. ఇరువైపులా వాదనలు విన్న ధర్మాసనం కవితకు బెయిల్ మంజూరు చేసింది. అయితే కవితకు బెయిల్ మంజూరు చేసే విషయంలో సుప్రీంకోర్టు మూడు అంశాలను ప్రధానంగా పరిగణలోకి తీసుకుంది. ఈ కేసులో సీబీఐ తుది ఛార్జిషీట్ దాఖలు చేయడం, ఈడీ దర్యాప్తును కూడా పూర్తి చేయడం, నిందితురాలు జైలులో ఉండాల్సిన అవసరం లేదంది. మహిళగా కూడా పరిగణించి కవితను బెయిల్ మంజూరు చేస్తున్నట్లు ద్విసభ్య ధర్మాసనం వెల్లడించింది. రూ.10 లక్షల చొప్పున రెండు కేసుల్లో రూ. 20 లక్షల వ్యక్తిగత పూచీకత్తుతోపాటు పాస్‌పోర్టు స్వాధీనం చేయాలని ఆదేశించింది.

రూ. 100 కోట్లు అక్రమ లావాదేవీలు జరిపినట్లు అభియోగాలు

దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఢిల్లీ లిక్కర్ స్కాం కేసులో కవితను మార్చి 15న హైదరాబాద్‌లో అరెస్టు చేశారు. ఈడీ కోర్టు ఆమెకు మార్చి 26న జ్యుడీషియల్ కస్టడీకి విధించింది. అప్పటి నుంచి కవిత తీహార్ జైలులోనే ఉన్నారు. ఇదే కేసులో సీబీఐ ఆమెను ఏప్రిల్ 15న అరెస్టు చేసింది. పలుమార్లు సీబీఐ అధికారులు ఆమెను విచారించి అభియోగాలు మోపారు. సౌత్ గ్రూప్ నుంచి రూ. 100 కోట్లు అక్రమ లావాదేవీలు జరిపినట్లు అభియోగాల్లో పేర్కొన్నారు. ఇదిలా ఉండగా.. 153 రోజులు జైలులో ఉన్న కవిత దాదాపు 11 కేజీలు బరువు తగ్గారు. ఈ క్రమంలోనే జూలై 16న కవిత తొలిసారి అస్వస్థతకు గురయ్యారు. దీంతో ఆమెను ఢిల్లీలోని దీన్ దయాళ్ ఉపాధ్యాయ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. జడ్జి అనుమతితో జూలై 18న ఎయిమ్స్‌కు తరలించి చికిత్స అందించారు. ఆగస్టు 22న కవిత మరోసారి అస్వస్థతకు గురయ్యారు. వైరల్ ఫీవర్‌తో పాటు, గైనిక్ సమస్యలతో బాధపడటంతో ఆమెను ఎయిమ్స్‌కు తరలించారు. భర్త అనిల్ సమక్షంలో వైద్య పరీక్షలు నిర్వహించిన డాక్టర్లు అదే రోజు తిరిగి జైలుకు తరలించారు. తాజాగా.. సుప్రీంకోర్టు బెయిల్ ఇవ్వడంతో ఐదు నెలల తర్వాత కవిత జైలు నుంచి బయటకు రానున్నారు. కవితకు బెయిల్ రావడంపై బీఆర్ఎస్ శ్రేణులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఉత్కంఠ..!

- పీసీసీ అధ్యక్షుడిగా మహేశ్ కే అవకాశం
- బీసీ సామాజిక వర్గంవైపే హైకమాండ్ మొగ్గు..
- రేపు ఏఐసీసీ నుంచి అధికారిక ప్రకటన !

అక్షరదర్బార్, ప్రత్యే ప్రతినిధి: తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ కొత్త అధ్యక్షుడి ఎంపికపై నెలకొన్న ఉత్కంఠకు మరి కొద్ది గంటల్లోనే తెరపడనుంది. కొంతకాలంగా పీసీసీ అధ్యక్ష పదవి కోసం పలువురు నేతలు తీవ్రంగా పోటీపడిన సంగతి తెలిసిందే. తమ పేర్లను పరిశీలించాలని అధిష్టానాన్ని కోరారు. ఇటీవల ఢిల్లీలో పార్టీ పెద్దలతో పలు దఫాలు సమావేశమైన రాష్ట్ర నాయకులు పీసీసీ పీఠంపై తీవ్రంగా చర్చించారు. ఈ చర్చల్లో బీసీలకే పీసీసీ అధ్యక్ష పదవి ఇచ్చేందుకు అధిష్టానం మొగ్గు చూపినట్లు తెలిసింది. చివరకు అన్ని సామాజిక, రాజకీయ అంశాలతోపాటు నేతల అభిప్రాయాలను పరిగణలోకి తీసుకున్న ఏఐసీసీ పెద్దలు పార్టీ వర్కింగ్ ప్రసిడెంట్‌గా ఉన్న మహేశ్ కుమార్ గౌడ్ వైపే మొగ్గు చూపినట్లు తెలుస్తోంది. కాగా, రేపు సాయంత్రం కల్లా అధికారికంగా మహేశ్ కుమార్ గౌడ్ పేరును ప్రకటించే అవకాశం ఉన్నట్లు గాంధీ భవన్ వర్గాల్లో చర్చ నడుస్తోంది. ఈక్రమంలోనే మహేశ్ కుమార్ గౌడ్ అనుచరులు ఢిల్లీకి వెళ్లడం ప్రాధాన్యం సంతరించుకుంది.

కవితకు బెయిల్ పట్ల సంబరాలు

అక్షర దర్బార్, మహాదేవపూర్ : ఎమ్మెల్సీ కవితకు సుప్రీంకోర్టు బెయిల్ ఇవ్వటం పట్ల మహాదేవపూర్ మండల కేంద్రంలో బీఆర్ఎస్ మహిళా నాయకురాలు సంబరాలు జరుపుకున్నారు. లిక్కర్ కేసులో జైలుకు వెళ్లిన కవితకు సుప్రీం కోర్ట్ బెయిల్ ఇవ్వడంతో బిఆర్ఎస్ పార్టీ మంథని నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు కేదారి గీతాబాయి ఆధ్వర్యంలో మండల కేంద్రంలో స్వీట్లు పంచి సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తప్పుడు కేసులో కవితను జైలుకు పంపారని చివరకు ధర్మమే గెలిచిందని అన్నారు. కార్యక్రమంలో పార్టీ మహిళా మండల అధ్యక్షురాలు ఒడేటి స్వప్న, మాజీ అధ్యక్షురాలు అరుణ, చిలుక సునీత, మహాదేవపూర్ మాజీ సర్పంచ్ శ్రీపతి బాపు, మాజీ ఉప సర్పంచ్ సల్మాన్, కాళేశ్వరం దేవస్థానం మాజీ డైరెక్టర్ కలికోట దేవేందర్, కానుకారి ప్రకాష్ శ్రీహరి, అలీమ్, వంశీవర్ధన్ రావు, రాకేష్, మహేష్ పాల్గొన్నారు.

బల్దియాలో ఫ్లెక్సీ దుమారం!

- టౌన్ ప్లానింగ్ అధికారులకు మెమోలు
- వివాదానికి ఆజ్యంపోసిన ఎల్ఆర్ఎస్ హెల్ప్ డెస్క్ ఫ్లెక్సీ ..
- బాధ్యులపై జీడబ్ల్యూఎంసీ కమిషనర్ క్రమశిక్షణ చర్యలు

అక్షరదర్బార్, హనుమకొండ: అనధికారిక లే ఔట్లు, ప్లాట్ల క్రమబద్ధీకరణ కోసం వరంగల్ మహా నగర పాలక సంస్థ కార్యాలయంలో పట్టణ ప్రణాళిక విభాగం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఎల్ఆర్ఎస్ హెల్ప్ డెస్క్ ఫ్లెక్సీ తీవ్ర దుమారం రేపింది. ఈ నెల 25న ఏర్పాటుచేసిన ఫ్లెక్సీలో పొరపాటున అధికారికంగా ప్రకటించని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రాజ ముద్రను ప్రదర్శించడం వివాదానికి కారణమైంది. పొరపాటును గుర్తించిన వెంటనే ఫ్లెక్సీని తొలగించి వాటి స్థానంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ రాజముద్రతో ఉన్న ఫ్లెక్సీను ప్రదర్శించారు. ఇందుకు బాధ్యులైన టౌన్ ప్లానింగ్ అధికారులపై జీడబ్ల్యూఎంసీ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే చర్యలు తీసుకున్నారు. సదరు అధికారులకు మెమోలు జారీ చేసినట్లు ఆమె పేర్కొన్నారు. దీంతో వివాదం సద్దుమణిగింది.

బెల్ట్ దందా.. కిరాణం చాటున

- పుట్టగొడుగుల్లా గల్లీ గల్లీకో షాపు..
- మద్యం మత్తులో ఊగుతున్న పల్లెలు
- తాగుడుకు బానిపై అప్పులపాలవుతున్న ప్రజలు
- కిరాణ షాపు పేరుతో మద్యం విక్రయం
- వైన్స్ షాపు కనుసన్నల్లోనే నిర్వహణ
- కన్నెత్తి చూడని ఎక్సైజ్ శాఖ
- మామూళ్ల మత్తులో అధికారులు
- రోడ్డున పడుతున్న కుటుంబాలు

అక్షర దర్బార్, రేగొండ:

తాగేందుకు గుక్కెడు నీరు లేని పల్లెలు ఉన్నాయి. కానీ మందు దొరకని పల్లెలు మాత్రం ఒక్కటి లేదు. పల్లెల్లో బెల్ట్ షాపుల దందా జోరుగా సాగుతోంది.ఉమ్మడి రేగొండ మండలంలోని పల్లెలు, మారుమూల గ్రామాలు మత్తులో ఊగుతున్నాయి. గ్రామాల్లో పుట్టగొడుగుల్లా బెల్ట్ దుకాణాలు వెలుస్తున్నాయి.నిబంధనలకు విరుద్ధంగా బెల్టు షాపులు ఏర్పాటు చేసి అధిక ధరలకు విక్రయిస్తున్నారు.అనేక మంది బెల్ట్ షాపుల్లో మద్యం కొనుగోలు చేసి జేబులు గుల్ల చేసుకుంటున్నారు. అప్పులు చేసి తాగడంతో కుటుంబాలు వీధి పాలవుతున్నాయి.రేగొండ,గోరి కొత్తపల్లి మండల కేంద్రాలతో సహా గ్రామాల్లో బహిరంగంగానే బెల్ట్ షాపులు నడుస్తున్నాయి. అనుమతి పొందిన వైన్ షాపుల నుంచే వందల సంఖ్యలో మద్యం బాటిల్లు బెల్టు దుకాణాలకు తరలిస్తున్నట్లు నిఘావర్గాలు పేర్కొంటున్నాయి. సంబంధిత ఎక్సైజ్ శాఖ అనుసంధానంలోనే, బెల్టు దుకాణాల నిర్వహణకు ప్రోత్సాహం ఉందని విమర్శలు వెలువెత్తుతున్నాయి. గ్రామాల్లో బెల్ట్ షాపులు కొనసాగుతూ ప్రజలు మత్తులో చిత్తవుతున్నా.. నిరోధించాల్సిన సంబంధిత శాఖ అధికారులు చోద్యం చూస్తున్నారు. బెల్ట్ షాపులు పల్లె ప్రజ లను మత్తులో ముంచెత్తుతున్నాయి. కానీ ఆబ్కారీ శాఖ అధికారులు మాత్రం కన్నెత్తి కూడా చూడటం లేదు.

బెల్ట్ షాపులకే అధిక ప్రయారిటీ!

ఉమ్మడి మండలంలోని వైన్ షాప్ నిర్వాహకులు బెల్ట్ షాపులకు మందు విక్రయించేందుకే అధిక ప్రయారిటీ ఇస్తున్నారు. కస్టమర్స్ కు నేరుగా అమ్మితే ఎమ్మార్పీ వస్తుంది. అదే బెల్ట్ షాప్ కు అమ్మితే ఎంఆర్పీకీ మించి అమ్మొచ్చనే ఉద్దేశంతో వైన్ షాప్ నిర్వాహకులు ఈ పనికి పాల్పడుతున్నారు. వైన్ షాపులలో మామూలు లిక్కర్ ఉంచి... బెల్ట్ షాపులకు మంచి మందు సప్లై చేస్తున్నారు. పేరున్న బ్రాండ్ల ను క్వార్టర్ బాటిల్ పై రూ.20 వరకు ఎక్కువ రేట్లకు బెల్ట్ షాపులకు పంపిస్తున్నారు. మొదట ఎమ్మార్పీ పై రూ.5 అదనంగా అమ్మిన వైన్ షాప్ ల నిర్వాహకులు, ఇప్పుడేమో ఏకంగా క్వార్టర్ బాటిల్ పై రూ.20 అదనంగా బెల్ట్ షాపు నిర్వాహకుల వద్ద తీసుకుంటున్నారు. వాళ్లు మరో రూ.20 చూసుకొని కస్టమర్లకు ఇస్తున్నారు. వైన్ షాపుకు వచ్చిన కస్టమర్లకు మాత్రం అడిగిన బ్రాండ్ లేదని, ఇతర బ్రాండ్ల కు చెందిన సీసాలను అంటగడుతున్నారు. దీంతో కొన్నిసార్లు షాపులోని సిబ్బందితో కస్టమర్లు గొడవకు దిగుతున్న పరిస్థితులు కూడా కనిపిస్తున్నాయి. వైన్ షాపు ల యజమానుల నిర్వాహకంతో మండలంలో రోజుకో కొత్త బెల్ట్ షాపు పుట్టుకొస్తున్నట్లు ప్రజలు వాపోతున్నారు.

పచ్చని సంసారాల్లో చిచ్చు..

మద్యం పచ్చని సంసారాల్లో చిచ్చు పెడుతోంది. ఊరూరా బెల్ట్ షాపులు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి. దీంతో పొద్దంతా పనిచేసి సంపాదించిన సొమ్మును మద్యానికి విచ్చేస్తూ కుటుంబాలను వీధిన పడేస్తున్నారు. గ్రామాల్లో బెల్ట్ షాపుల నిర్వహిస్తుండడంతో యువత పెడదారి పడుతున్నారు.

పేరుకే కిరాణం.. కానీ అమ్మేది మద్యమే !

అనేకమంది పేరుకే కిరణా దుకాణాలు నిర్వహిస్తూ లోపల మాత్రం మద్యం వ్యాపారం చేస్తున్నారు. సొంత ఇళ్లలో పెద్ద ఫ్రిజ్ లో పెట్టుకొని మరి విక్రయిస్తున్నారు. వైన్ షాప్ ల యజమానులు ఆటోల ద్వారా మద్యాన్ని ఊరూరా సరఫరా చేస్తున్నారు. తమకు కేటాయించిన గ్రామాలకు నిత్యం ఆటోలు అలాగే బైకుల ద్వారా పేరు మోసిన బ్రాండ్లను పంపించి సొమ్ము చేసుకుంటున్నారు. మద్యం మత్తులో ఇళ్ల మధ్యలో గొడవలు పడుతూ అర్ధరాత్రి వరకు నానా రభస చేస్తున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ప్రతి గ్రామంలో బెల్ట్ షాపుల ద్వారా మద్యం ఏరులై పారుతుందనీ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి నిర్వాహకుల పై కఠిన చర్యలు తీసుకోవాలని ఉమ్మడి మండల ప్రజలు కోరుతున్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న మిర్యాల రాజిరెడ్డి

కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

టీబీజీకేఎస్ కేంద్ర అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి

అక్షర దర్బార్ భూపాలపల్లి: సింగరేణి కార్మికుల సమస్యలను పరిష్కరించాలని టీబీజీకేఎస్ కేంద్ర కమిటీ అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి కోరారు. భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో బీఅర్ఎస్ పార్టీ అనుబంధం తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం కేంద్ర కార్యవర్గ సమావేశం మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా రాజిరెడ్డి మాట్లాడుతూ సింగరేణి లో గుర్తింపు సంఘం ఎన్నికల్లో కాంగ్రెస్ అనుబంధ ఐఎన్టీయుసీ గెలిచి 9 నెలలు గడుస్తున్నా ఇంతవరకు గుర్తింపు సంఘం హోదా లేకపోవడం విడ్డురంగా ఉందని, కార్మికుల సమస్యలు పరిష్కారం కాక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు. సింగరేణి వ్యాప్తంగా ప్రమాదాలు జరుగుతున్నా యాజమాన్యం పట్టించుకోకుండా నిర్లక్ష్యం వహిస్తోందని, వెంటనే కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరారు.

నినాదాలు చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

బీఆర్ఎస్ శ్రేణుల సంబురాలు

అక్షర దర్బార్, పరకాల : బీఆర్ఎస్ నేత, ఎమ్మెల్సీ కవితకు బెయిల్ మంజూరైన సందర్భంగా శాయంపేట మండల కేంద్రంలో భారత జాగృతి రాష్ట్ర కార్యదర్శి అమ్మ అశోక్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ నాయకులు సంబురాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా అమ్మ అశోక్ మాట్లాడుతూ.. దేశంలోనే ఎక్కడా లేనివిధంగా ఆరు నెలల కాలం పాటు విచారణ పేరుతో కవితక్కని జైల్లో పెట్టడం సిగ్గుచేటని, కాంగ్రెస్, బిజెపి ప్రభుత్వాలకు రాబోయే కాలంలో ప్రజలు తగిన గుణంపాఠం చెబుతారని హెచ్చరించారు. అనంతరం బాంబులు కాల్చి స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు అరికెళ్ల ప్రసాద్, మాజీ ఎంపీటీసీ గడిపే విజయ్, బీఆర్ఎస్వీ రాష్ట్ర నాయకులు కొమ్ముల శివ, నాయకులు మరపల్లి మోహన్, కుతాటి రమేష్, ఆరిజల ఆది రెడ్డి, అరికెళ్ల దేవయ్య, యూత్ నాయకుడు అరికెళ్ల వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా పరకాల-హన్మకొండ రోడ్డు

అక్షర దర్బార్, పరకాల : అడుగుకో గుంత.. ఆదమరిస్తే అంతే సంగతులు.. వాహనదారులకు ప్రాణసంకటంగా మారింది. పరకాల–హన్మకొండ రహదారి అంబేద్కర్ సెంటర్ నుండి కామారెడ్డి పల్లి వరకు పూర్తిగా దెబ్బతిని వాహనదారులకు చుక్కలు చూపిస్తోంది. నిత్యం ఎంతో రద్దీగా ఉండే ఈ రహదారిపై పెద్ద పెద్ద గుంతలు ఏర్పడి ప్రమాదకరంగా మారాయి. ప్రతినిత్యం ఎంతోమంది ఆ గుంతల్లో పడి ప్రమాద బారిన పడుతున్నా అధికారులు ఏమాత్రం పట్టించుకోవడం లేదని వాహనదారులు వాపోతున్నారు. భారీ ప్రమాదం జరగక ముందే అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

బాధిత కుటుంబాలకు మాజీ ఎమ్మెల్యే పరామర్శ..

అక్షర దర్బార్, మహాదేవపూర్ : మండలంలోని బేగ్లూరుగ్రామానికి చెందిన ఆకుల పోషన్న, చిన్నోల సమ్మన్న ఇటీవల మరణించగా వారి కుటుంబ సభ్యులను మంథని మాజీ ఎమ్మెల్యే, పెద్దపెల్లి జెడ్పీ చైర్మన్ పుట్ట మధుకర్ మంగళవారం పరామర్శించారు. ఆయనవెంట బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు లింగంపల్లి శ్రీనివాసరావు, డివిజన్ మహిళా అధ్యక్షురాలు గీతా బాయి, మహాదేవపూర్ మాజీ సర్పంచ్ శ్రీపతి బాపు, మాజీ ఉపసర్పంచ్ సల్మాన్ ఖాన్, యూత్ అధ్యక్షుడు హలీమ్ ఖాన్ ఉన్నారు.

నివాళులర్పిస్తున్న పుట్ట మధుకర్

మహదేవ్ జూవెలర్స్ ప్రారంభం..

ప్రారంభించిన మాజీ సర్పంచ్ కందగట్ల నరహరి

అక్షర దర్బార్ సంగెం: మండల కేంద్రంలో మహాదేవ్ జూవెలర్స్ షాప్ ను మాజీ సర్పంచ్ కందగట్ల నరహరి మంగళవారం ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచులు గుండేటి బాబు, కావటి వెంకటయ్య, మాజీ ఎంపీటీసీ మెట్టిపల్లి మల్లయ్య, మెట్టిపల్లి రమేష్, అగపాటి రాజు, మునుకుంట్ల మోహన్, కాగితాల జగన్నాధం చారి, గుండాల మొగిలి, నల్లతీగల రవి, బుసాని మొగిలి, మెట్టిపల్లి రాజు, గోపతి రాజు, గుండేటి శ్రీకర్ ,బిట్ల లక్ష్మణ్, నంగునూరి సాంబయ్య రిటైడ్ టీచర్, షాప్ వోనర్ సునీల్ శెట్టర్ పోల్గొన్నారు.

జువెల్లర్స్ ను ప్రారంభిస్తున్న మాజీ సర్పంచ్ కందగట్ల నరహరి

అక్షర దర్బార్
voice of the people
తెలుగు దినపత్రిక

రామప్పలో పూజలు చేస్తున్న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

గోటగుళ్లను సందర్శిస్తున్న గవర్నర్

- ఆర్థిక అభివృద్ధి సాధించాలి
- విద్యా అవకాశాలను అందిపుచ్చుకోవాలి
- పథకాలను సద్వినియోగం చేసుకోవాలి
- ఆ దిశగా అధికారులు చిత్తశుద్ధితో కృషి చేయాలి
- రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ
- ములుగు జిల్లాలో పర్యటన
- ఉన్నతాధికారులతో సమావేశం
- రామప్ప, కోటగుళ్లు సందర్శన

ఆదివాసీలు, గిరిజనులు అన్ని రంగాల్లో ముందుండాలి

అక్షరదర్బార్, ములుగు : అడవిని నమ్ముకుని జీవించే నిర్మలమైన మనసు గల ఆదివాసీలు, గిరిజనుల అభ్యున్నతికి అధికారులు చిత్తశుద్ధితో కృషి చేయాలని రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ సూచించారు. ఆదివాసీలు, గిరిజనులు అవకాశాలను అందిపుచ్చుకుంటూ అన్ని రంగాల్లో ఎదగాలని ఆకాంక్షించారు. మూడు రోజుల పర్యటనలో భాగంగా మంగళవారం గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ ములుగు జిల్లాకు చేరుకున్నారు. తొలుత యాదాద్రి జిల్లా పర్యటన అనంతరం రోడ్డు మార్గంలో ములుగుకు వచ్చారు. స్థానిక ఆర్ అండ్ బీ గెస్ట్ హౌస్‌లో గవర్నర్‌కు రాష్ట్ర మంత్రి సీతక్క, భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావ్, జిల్లా కలెక్టర్ టీఎస్ దివాకర, ఎస్పీ డాక్టర్ పీ శబరీష్, డీఎఫ్ఓ రాహుల్ కిషన్ జాదవ్, అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) శ్రీజ, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) మహేందర్ జీ తదితరులు పూలమొక్కలు అందజేసి ఘన స్వాగతం పలికారు. అనంతరం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్ లో జిల్లా ఉన్నతాధికారులతో ప్రత్యేకంగా భేటీ అయ్యారు. జిల్లా కలెక్టర్, ఎస్పీ, డీఎఫ్ ఓలు ములుగు జిల్లా సమగ్ర అభివృద్ధిపై పవర్ పాయింట్ ప్రెసెంటేషన్ ఇచ్చారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ తాను గవర్నర్ గా భాద్యతలు స్వీకరించిన తొలి పర్యటనగా షెడ్యూల్ ప్రాంతమైన ములుగు జిల్లాను ఎంచుకొని వచ్చానని అన్నారు. గతంలో పంచాయతీ రాజ్, రూరల్ డెవలప్మెంట్ మంత్రిగా పని చేసిన అనుభవం ఉందన్నారు. ప్రభుత్వ పథకాలు బాగున్నాయని ప్రశంశించారు. పేదల అభ్యున్నతికి, గిరిజనులు ఆదివాసుల అభ్యున్నతికి ప్రభుత్వం ప్రత్యేకంగా కృషి చేస్తున్నదని పేర్కొన్నారు. ముఖ్యంగా విద్య, ఆరోగ్య రంగాల్లో అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నదని తెలిపారు. ఇదే స్ఫూర్తి నిరంతరం కొనసాగాలని, ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలతో గిరిజనులు ఆదివాసులు అన్ని రంగాల్లో ఆర్థికంగా అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. ఈ స్ఫూర్తి కొనసాగాలని కోరారు. ఆధునిక సమాజంలో ఆదివాసీలు, గిరిజనులను భాగస్వాములు చేసేందుకు ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయన్నారు. వీరికోసం జిల్లాలో కంటైనర్ హాస్పిటల్ వినూత్నంగా ఏర్పాటు చేయడం పట్ల మంత్రి సీతక్కను ప్రత్యేకంగా అభినందించారు. ఆదివాసీ, గిరిజన గ్రామాల అభివృద్ధికి నిరంతరం కృషి చేయాలని, మీరంతా అత్యుత్తమంగా విద్యను అభ్యసించి నవ సమాజ నిర్మాణంలో కీలక పాత్ర పోషించాలని పేర్కొన్నారు.

జిల్లాకు రావడం సంతోషం: సీతక్క

తొలిసారి జిల్లా పర్యటనకు గవర్నర్ రావడం పట్ల జిల్లా ప్రజల తరుపున మంత్రి సీతక్క గవర్నర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ములుగు జిల్లా రాష్ట్రంలోనే అత్యధిక అటవీ విస్తీర్ణం కలిగి ఉన్నదని, 30 శాతం మంది ఆదివాసీలు, గిరిజన ప్రజలు ఈ జిల్లాలో నివసిస్తున్నారని అన్నారు. ప్రజలంతా ఐకమత్యంతో నివసిస్తూ భిన్నత్వంలో ఏకత్వానికి ప్రతీకగా నిలుస్తున్నారని పేర్కొన్నారు. జిల్లా అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం సంపూర్ణ సహకారం అందిస్తున్నదని తెలిపారు. ఆదివాసీలు, గిరిజనుల అభ్యున్నతికి ప్రభుత్వం నిరంతరం సహకారం అందిస్తున్నదని తెలిపారు. ఆసియా ఖండంలో అతి పెద్ద ఆదివాసీ గిరిజన మేడారం మహాజాతర ప్రతీ రెండు ఏళ్లకు ఒకసారి అత్యంత వైభవంగా జరుగుతుందని పేర్కొన్నారు. ఈ జాతర జాతీయ పండుగగా గుర్తించే విధంగా తగు చర్యలు తీసుకోవాలని గవర్నర్‌ను కోరారు. ములుగు జిల్లా చరిత్ర, పర్యాటక కేంద్రాలు, జిల్లా విశిష్టత, విశేషాలను గవర్నర్ కు వివరించారు.

కాకతీయుల కళాసంపద అద్భుతం

అనంతరం గణపేశ్వరాలయం ఆవరణలో తవ్వకాల్లో బయటపడ్డ శిల్పాలను గవర్నర్ పరిశీలించారు.
ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాకతీయుల వైభవాన్ని చాటే గొప్ప కట్టడం గణేపేశ్వరాలయం అని, సుమారు 12వ శతాబ్దంలో కాకతీయులు ఓరుగల్లు ప్రాంతాన్ని పాలించిన సమయంలో ప్రజల సౌకర్యార్థం అద్భుతమైన కట్టడాలను నిర్మించారని అన్నారు. కాకతీయులు ఇతర రాజ్యాలపై దండయాత్ర చేసి సాధించిన విజయానికి గుర్తుగా ఒక్కొక్క గుడిని నిర్మించారని తెలిపారు.

ప్రముఖులతో సమావేశం..

ఆర్ అండ్ బీ గెస్ట్ హౌస్‌లో జిల్లాకు చెందిన రచయితలు, కవులు, కళాకారులు, జాతీయ, అంతర్జాతీయ క్రీడా అవార్డు గ్రహీతలు, వివిధ రంగాలకు చెందిన ప్రముఖులతో గవర్నర్ సమావేశం అయ్యారు. జిల్లాకు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పేరు ప్రాఖ్యాతులు తీసుకురావడం పట్ల వారిని అభినందించారు. ప్రొఫెసర్ పాండు రంగారావు రామప్ప దేవాలయం, నిర్మాణం, సాండ్ బాక్స్ టెక్నాలజీ, ఆలయ విశిష్టత వివరించారు.

అగ్నిప్రమాద బాధితులను పరామర్శిస్తున్న కొండా మురళీధర్ రావు

అధైర్యపడొద్దు.. అండగా ఉంటాం..

మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్ రావు

అక్షరదర్బార్, వరంగల్ : అధైర్యపడొద్దని ఎల్లవేళలా అండగా ఉంటామని మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్ రావు అగ్నిప్రమాద బాధితులకు భరోసా కల్పించారు. శివనగర్‌లో ఇండ్లు అగ్ని ప్రమాదానికి గురికాగా బాధితులను మంగళవారం పరామర్శించారు. అగ్ని ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ... బాధితులకు ప్రభుత్వం తరఫున నష్టపరిహారం అందేలా మంత్రి కొండా సురేఖ, తాను ప్రత్యేక చొరవ తీసుకుంటామని తెలియజేశారు. అనంతరం కొత్తవాడలో మాజీ కార్పొరేటర్ యెలగం శ్రీనివాస్ గుండెపోటుతో మరణించగా కొండా మురళీ వెళ్లి ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఓసిటీలోని కాంగ్రెస్ పార్టీ క్యాంప్ కార్యాలయంలో ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. ప్రజల సమస్యలను సావధానంగా వింటూ సంబంధిత శాఖల అధికారులతో అప్పటికప్పుడే ఫోన్‌లో మాట్లాడి సమస్యలను పరిష్కరించారు.

ర్యాగింగ్, డ్రగ్స్ పై అవగాహన సదస్సు

- హాజరైన హుజురాబాద్ ఏసీపీ

అక్షరదర్బార్, జమ్మికుంట: కరీంనగర్ జిల్లా జమ్మికుంట పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలతోపాటు చాణక్య, గాయత్రి డిగ్రీ కళాశాలల విద్యార్థులకు పోలీసులు మంగళవారం ర్యాగింగ్, డ్రగ్స్ పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన హుజురాబాద్ ఏసీపీ శ్రీనివాస్ జీ మాట్లాడుతూ ర్యాగింగ్, డ్రగ్స్ చట్టాలను విద్యార్థులకు వివరించారు. ర్యాగింగ్ కు పాల్పడి, డ్రగ్స్ కు అలవాటు పడి తమ జీవితాలను నాశనం చేసుకోవద్దని అన్నారు. ర్యాగింగ్, డ్రగ్స్ కు దూరంగా ఉండాలని చెప్పారు. జమ్మికుంట సీఐ వరగంటి రవి, ఎస్సై టి వివేక్ తో పాటు స్థానిక పోలీస్ సిబ్బంది, లెక్చరర్లు తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ అందజేసిన ఫ్రీజర్

నిరుపేద అంత్యక్రియలకు లయన్స్ చేయూత

అక్షర దర్బార్, కేసముద్రం: కేసముద్రం స్టేషన్ బ్రహ్మంగారితండాలో మృతి చెందిన నిరుపేద ఓర్సు మల్లయ్య(70) అంత్యక్రియలకు కేసముద్రం లయన్స్ క్లబ్ సహకారాన్ని అందించింది.సోమవారం రాత్రి మృతి చెందిన మల్లయ్యకు సొంత ఇల్లు లేకపోవడంతో ఆయన మృతదేహాన్ని స్థానిక బస్టాండ్ ఆవరణలోకి తీసుకువచ్చారు. ఆయన బంధువులు వచ్చేంత వరకు మృతదేహాన్ని భద్రపర్చేందుకు ఇబ్బందులు పడుతుండగా ఈ విషయాన్ని తెలుసుకున్న స్థానిక లయన్స్ క్లబ్ సభ్యులు బాడీ ఫ్రీజర్ ను ఉచితంగా ఏర్పాటు చేశారు. అలాగే మంగళవారం జరిగిన అంత్యక్రియలకు వైకుంఠ రథాన్ని కూడా ఉచితంగా అందించారు. తండావాసులు విరాళాలు పోగుచేసి ఆయన అంత్యక్రియలను పూర్తి చేశారు.

సెప్టెంబర్ 17 నుంచి ప్రజా పాలన

- పది రోజులపాటు కార్యక్రమం
- రేషన్ కార్డులు, హెల్త్ కార్డులే ఎజెండా
- అధికారుల సమీక్షలో సీఎం రేవంత్ రెడ్డి

అక్షరదర్బార్, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. ప్రభుత్వం ఏర్పాటైన కొత్తలో ప్రజాపాలన దరఖాస్తులు స్వీకరించిన సర్కార్.. ఇప్పుడు మరో దఫా ప్రజా పాలన కార్యక్రమం నిర్వహించేందుకు సిద్ధమైంది. రేషన్ కార్డు, హెల్త్ కార్డుల కోసం వివరాలు సేకరించనుంది. పూర్తి హెల్త్ ప్రొఫైల్‌తో రాష్ట్రంలో ప్రతి పౌరుడికి హెల్త్ కార్డు మంజూరు చేయాలని భావిస్తోంది. ఇందుకు సంబంధించి క్షేత్రస్థాయిలో అధికారులను సన్నద్ధం చేయాలని సీఎం ఆదేశించారు. మంగళవారం స్పీడ్ (స్మార్ట్ ప్రోయాక్టీవ్ ఎఫిషియెంట్ అండ్ ఎఫెక్టివ్ డెలివరీ)పై అధికారులతో సీఎం సమావేశమయ్యారు. మంత్రి దామోదర రాజనర్సింహతో కలిసి అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ భేటీలో అధికారులకు సీఎం కీలక సూచనలు, సలహాలు ఇచ్చారు. సెప్టెంబర్ 17వ తేదీ నుంచి పది రోజులపాటు మరోసారి ప్రజాపాలన కార్యక్రమం చేపట్టాలని ఆదేశించారు. ఇందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. హెల్త్ డిజిటల్ కార్డుల జారీకి ఎలాంటి పద్ధతి అనుసరించాలి...? ప్రతి ఒక్కరి హెల్త్ ప్రొఫైల్ నమోదు చేసేందుకు ఏయే వైద్య పరీక్షలు చేయాలి.. ? గ్రామాల్లోనే హెల్త్ చెకప్ శిబిరాలు ఏర్పాటు చేయాలా... ? రాష్ట్రంలో ఉన్న లాబోరేటరీల సాయం తీసుకోవాలా...? వెంటనే పరిశీలించి నిర్ణయాలు తీసుకోవాలని ముఖ్యమంత్రి వైద్య ఆరోగ్య శాఖ అధికారులను ఆదేశించారు. రాజీవ్ ఆరోగ్య శ్రీ వైద్య సేవలకు, సీఎంఆర్‌ఎఫ్ ద్వారా సాయం అందించేందుకు ఇకపై రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసే హెల్త్ కార్డు ప్రామాణికంగా ఉంటుందని సీఎం అన్నారు. అలాగే, హైదరాబాద్‌లోని ఉస్మానియా ఆస్పత్రిని గోషామహల్‌కు తరలించాలని సీఎం రేవంత్ రెడ్డి నిర్ణయించారు. ఇందుకు సంబంధించి భూ బదలాయింపు కార్యక్రమాన్ని ముమ్మరం చేయాలని ఆదేశించారు. ఆస్పత్రి నిర్మాణానికి ఆర్కిటెక్ట్స్‌తో డిజైన్లు రూపొందించాలన్నారు. వచ్చే 50 ఏళ్లను దృష్టిలో ఉంచుకుని ఆస్పత్రిని నిర్మించాలని అధికారులకు సీఎం దిశానిర్దేశం చేశారు. ఎలాంటి సమస్యలు తలెత్తకుండా డిజైన్లు ఉండాలన్నారు. ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా రోడ్ కనెక్టివిటీ ఉండేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులను ముఖ్యమంత్రి ఆదేశించారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, వైద్యారోగ్య శాఖ ముఖ్య కార్యదర్శి డాక్టర్ క్రిస్టినా చొంగ్తూ, మున్సిపల్ శాఖ ముఖ్య కార్యదర్శి దాన కిశోర్, సీఎం ముఖ్య కార్యదర్శి శేషాద్రి పాల్గొన్నారు.

జోరుగా కాంగ్రెస్ యూత్ ఎలక్షన్స్ ప్రచారం

మందపల్లిలో ప్రచారం చేస్తున్న నాయకులు

దుగ్గొండి, అక్షర దర్బార్ యూత్ ఎలక్షన్స్ లో భాగంగా యూత్ నాయకులు జోరుగా ప్రచారం నిర్వహిస్తున్నారు మంగళవారం యువజన నాయకులు దుగ్గొండి మండలం మందపల్లి, పీజీ తండ గ్రామాల యూత్ సభ్యులందరికి ఐ వై సి యాప్ మెంబర్ షిప్ గురించి వివరించి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి యువకుడు యూత్ ఎన్నికల్లో పాల్గొనాలని సూచించారు. కార్యక్రమంలో దుగ్గొండి మండల యూత్ అధ్యక్ష అభ్యర్థి కొత్తకొండ రవివర్మ మరియు నర్సంపేట ST సెల్ డివిజన్ అధ్యక్షులు జయరాం నాయక్ గారు ,మందపల్లి గ్రామ పార్టీ అధ్యక్షులు రాజేశ్వరచార్యులు గారు ,సీనియర్ నాయకులు జంగిలి రవి గారు ,వెంకట్ రెడ్డి గారు ,నర్సంపేట బ్లాక్ యూత్ వర్కింగ్ ప్రెసిడెంట్ ద్యాగం శివాజీ ,కమలాకర్ ,శ్రీను ,క్రాంతి ,వివేక్ ,హరీష్ ,కృష్ణకాంత్ ,నేతాజీలు మరియు నాయకులు పాల్గొన్నారు.

విజృంభిస్తున్న విషజ్వరాలు

అక్షర దర్బార్,తొర్రూరు : డివిజన్ కేంద్రంలో విష జ్వరాలతో బాధపడుతూ పట్టణానికి చెందిన బీటెక్ విద్యార్థి మృతి చెందగా, తాజాగా తొర్రూరు పట్టణానికి అనుకొని ఉన్న వెంకటాపురం గ్రామ శివారు కేవులా తండాకు చెందిన బానోతు లచ్చిరాం నాయక్ తీవ్ర జ్వరానికి గురై మంగళవారం మరణించారు. విషయం తెలుసుకున్న తొర్రూరు ప్రభుత్వ వైద్య అధికారులు హుటాహుటిన వెంకటాపురం గ్రామంలోని కేవూలా తండాకు చేరుకొని గ్రామంలో జర్వ పరీక్షలు చేపట్టారు. కొంత మందికి రాపిడ్ టెస్టులు చేశారు.

కేటీఆర్ కు హైడ్రా షాక్ !

- జన్వాడ ఫాంహౌస్ కూల్చివేతకు రంగం సిద్ధం !
- కొలతలు వేసిన ఇరిగేషన్ అధికారులు

అక్షరదర్బార్, హైదరాబాద్: అక్రమ కట్టడాలను బుల్డోజర్లతో నేలమట్టం చేస్తున్న హైడ్రా మరో సంచలనానికి సిద్ధమైంది. మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఉపయోగిస్తున్న జన్వాడ ఫాం హౌస్‌ను కూల్చివేసేందుకు హైడ్రా సిద్ధమైనట్లు తెలుస్తోంది. రంగారెడ్డి జిల్లా శంకరపల్లి సమీపంలోని ఫాంహౌస్‌కు వెళ్లిన అధికారులు అక్కడ కొలతలు తీసుకొని సర్వే చేశారు. ఇరిగేషన్ అధికారులు వివరాలను పరిశీలించారు. కాగా, జన్వాడ ఫాం హౌస్‌తోపాటు అక్కడ మరికొందరు ప్రముఖులకు సంబంధించిన ఫాంహౌస్‌లు కూడా ఉన్నాయి. దీంతో ఏకకాలంలో ఫామ్‌హౌస్‌లను కూల్చివేసే అవకాశాలు ఉన్నాయి.

గ్రామాల సమగ్ర అభివృద్ధి లక్ష్యం

- భూపాలపల్లి ఎమ్మెల్యే జీఎస్సాఆర్
- బుద్ధారం గ్రామంలో ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు

అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే

అక్షరదర్బార్, గణపురం: ప్రజా పాలనలో అన్ని గ్రామాల సమగ్ర అభివృద్ధి ప్రభుత్వ లక్ష్యమని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. ఆయన మంగళవారం తన స్వగ్రామమైన గణపురం మండలంలోని బుద్ధారం గ్రామంలో పర్యటించారు. ముందుగా గ్రామంలోని పర్వత వర్ధిని శ్రీ రామలింగేశ్వర స్వామి దేవాలయంలో ఎమ్మెల్యే సత్యనారాయణరావు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం రూ.5 లక్షలతో నిర్మించిన రజక కమ్యూనిటీ భవనాన్ని ప్రారంభించారు. రూ.14.10 లక్షలతో యాదవ, రూ.25 లక్షలతో ఎస్సీ కమ్యూనిటీ, 25 లక్షలతో ముదిరాజు కమ్యూనిటీ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. చివరగా రూ.9.70 కోట్లతో బుద్ధారం నుంచి రేగొండ మండలంలోని రామన్నగూడెం తండా వరకు బీటీ రోడ్డు నిర్మాణం, రూ.2.97 కోట్లతో కల్వర్టుల నిర్మాణానికి ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంట్రాక్టర్లు అభివృద్ధి పనులను నాణ్యతతో నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని అన్నారు.

ఉద్యాన పంటలు సాగు చేయాలి

ఉద్యానవన అధికారిని జ్యోతి

దుగ్గొండి: రైతులు ఉద్యానవన పంటలను సాగు చేసి అధిక లాభాలు అర్జించాలని ఉద్యానవన అధికారిని జ్యోతి అన్నారు. మండలంలోని చాపలబండ, మందపల్లి గ్రామాల్లో అరటి తోటలను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడుతూ ఉద్యానవన పంటలు వేసుకున్న రైతులు సకాలంలో ఎరువుల యజమాన్యం చేపట్టాలని సూచించారు. అరటి, బొప్పాయి సాగు చేసిన రైతులు ఆధార్ కార్డ్, పట్టాదారు పాస్ బుక్, బ్యాంక్ అకౌంట్ తో పాటు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. రైతులకు ఉద్యానవన పంటలకు 90% రాయితీతో డ్రిప్పు అందుబాటులో ఉందని కావాల్సిన రైతులు దరఖాస్తు చేసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో ఎడెల్లి అశోక్ రెడ్డి,ఆరే రాజిరెడ్డి,అంబరగొండ బాబురావు, పొలంపల్లి సాంబ రెడ్డి, తోకల తిరుపతిరెడ్డి, తోకల శ్రీనివాస్ రెడ్డి,ఎడెల్లి దామోదర్ రెడ్డి, ఆరె కరుణాకర్ రెడ్డి, ఆరె హైమావతి, ఎడెల్లి విజయ తదితరులు పాల్గొన్నారు.

అరటి తోటను పరిశీలిస్తున్న ఉద్యానవన అధికారిణి

మాట్లాడుతున్న ఏవో సుజాత

కిశోర బాలికలకు స్నేహ హస్తం

అక్షర దర్బార్ సంగెం : శాంతి మండల సమైక్య సమావేశం మందిరంలో కిశోర బాలికలతో స్నేహ బాలిక సంఘాల ఏర్పాటుకు అవగాహన సదస్సు మండల కేంద్రం లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డ్వాక్రా ఏవో సుజాత పాల్గొని మాట్లాడుతూ.. అవకాశాలు అందిపుచ్చుకుని జాతీయాభివృద్ధిలో బాలికలు క్రియాశీలక పాత్ర పోషించేలా అన్ని రంగాల్లో ఉన్నత అవకాశాలు అందుకునేలా విద్యాపరంగా ముందడుగు వేయాలని కోరారు. కార్యక్రమంలో ఏపిఎం కిషన్ ఎమ్మెస్ అధ్యక్షురాలు కర్నే కళ్యాణి, కార్యదర్శి రాజమణి, సీసీలు సురేశ్, కుమార స్వామి, ఏలియా, రాజయ్య, కృష్ణమూర్తి, ఎమ్మెస్ సిబ్బంది సుజాత,కృష్ణ ,కృష్ణవేణి మంజుల విఓఏలు తదితరులు పాల్గొన్నారు.

గ్రామపంచాయతీ కార్మికులకు జీతాల చెల్లింపు...

జీపీ కార్మికులకు జీతాలు అందజేస్తున్న కార్యదర్శి

అక్షర దర్బార్, కేసముద్రం : మండలంలోని విలేజ్ కేసముద్రం గ్రామపంచాయతీ కార్మికులకు పంచాయతీ కార్యదర్శి మధు నాయుడు మంగళవారం ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో జీతాలను చెల్లించారు. గతంలో వారికి రెండు లక్షల పదిహేను వేల రూపాయల జీతాలు పెండింగ్ ఉండటంతో కార్మికులు చాలా ఇబ్బందులకు గురయ్యారు. దీంతో స్పందించిన కార్యదర్శి మధు నాయుడు వారికి జీతాలను చెల్లించారు. ఈ సందర్భంగా కార్యదర్శి మాట్లాడుతూ.. తనపై కావాలనే తప్పుడు ఆరోపణలు చేయిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నవంబర్ జీతాలను ఎస్టీవో లో జమ చేశానని తను ఎలాంటి సొంత ప్రయోజనాలకు వాడుకోలేదన్నారు. తాను విలేజ్ కేసముద్రం గ్రామపంచాయతీలో ఏడు నెలలు విధులు నిర్వహించానని ఆ సమయంలో తాను పారదర్శకంగా పనిచేసి గ్రామ అభివృద్ధికి తోడ్పడ్డానని తెలిపారు. కానీ కొంతమంది వ్యక్తులు కావాలనే ఉద్దేశపూర్వకంగా ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తాను ఎక్కడ పని చేసినా పారదర్శకంగా జవాబు దారితనంగానే పనిచేస్తానని ఈ సందర్భంగా తెలిపారు.